# చీమలు పెట్టిన పుట్టలు

మెల్లగా సాగిపోతున్న రెండెద్దుల బండిలో బిడ్డల నిద్దర్నీ చెరొకవైపున పడుకో బెట్టుకుని, గత జీవితాన్ని గురించి ఆలోచిస్తూ కూర్చుంది కళ్యాణి.

ఎక్కడో దూరంగా కనిపిస్తున్న పడమటి కొండచాటున అస్తమించిన లోకబాంధవుడి కెంపురంగులు కొన్ని యింకా ఆకాశాన అలముకుని వుండబట్టి సరిపోయింది కానీ లేకుంటే ఆ పాటికి లోకం కారుచీకటిలో మునిగిపోయి వుండేది.

వెంకట్రామయ్య తన చావుని గురించి కలగన్న వాడిలా చనిపోవడానికి నాలుగైదు నెలలు ముందుగా తొందరపడి కుమార్తెకి పెళ్ళి చేసేశాడు. లేకుంటే కళ్యాణి బ్రతుకు ఎలా పరిణమించి వుండేదని ఊహించడం కష్టం. ఎవరెరుగుదురు, ఈ జీవితగాథ ఈవిధంగా కాకుండా మరొక విధంగా పరిణమించి వుంటే ఏమై వుండేదన్న విచిత్ర ప్రశ్నకి సమాధానం?

కళ్యాణి పెళ్ళి ఆమె అనుకున్నంతకంటే వైభవంగానే జరిగింది. కానీ అందుకు కారణం వెంకట్రామయ్య ప్రయోజకత్వమని మాత్రం చెప్పడానికి వీల్లేదు. ఆయన సంపాదించిన ఆస్తికంటే చేసిన అప్పులు ఎక్కువ. ఊరూరా గాజు బుడ్డీలతో నిండిన బీరువాలతో డాక్టర్లు వెలసిన తర్వాత వెంకట్రామయ్యకు తాత ముత్తాలనుంచీ సంక్రమించిన వైద్యవృత్తి ఉదర పోషణకు వెరవు చూపించలేకపోయింది. అందుచేత అతని సాంసారిక జీవితమంతా లోటు బడ్జెట్టుని పూర్తిచేడమెలాగా అన్న నిరంతర సమస్యని ఎదుర్కోవడంతోనే సరిపోయింది. కానీ చనిపోకముందు అతడొకటి రెండు అద్భుతమైన పనులు చేసి మరీ చనిపోయాడు. తన తరువాత అటు తన కుమారుడు నాగరాజుకి గాని, యిటు తన కుమార్తె కళ్యాణికి గానీ జీవితం సమస్యలా కాకుండా, వడ్డించిన విస్తరిలా ఆనందప్రదం కావాలని ఆ వృద్ధుడు తన చివరి రోజుల్లో చాలా తాపత్రయ పడ్డాడు. అతడి కోరిక నెరవేరడానికి పరిస్థితులు అనుకూలించాయి.

తను శాశ్వతంగా కళ్ళు మూసుకోడానికిక ఆరు నెలల ముందు ఒకానొక కేసులో సాక్ష్యం చెప్పవలసి వచ్చి వెంకట్రామయ్య కోర్టుకి హాజరయ్యాడు. ఆ రోజు అమావాస్య. మధ్యాహ్నం రెండు గంటలవరకూ కోర్టు పనితోనే సరిపోయింది. ఆ తరువాత తర్పణ వదలుకోడానికి ఆయన ఆదరాబాదరా బస్తీకి ప్రక్కనే ప్రవహిస్తున్న ఏటివైపు వెళ్తూ మార్గమధ్యంలో ఒక చింత చెట్టుకింద పచ్చికపైన పడుకుని అటూ ఇటూ దొర్లుతూ ఆపసోపాలు పడుతున్న ముసలాడి నొకణ్ణి చూచాడు. ఆ వృద్ధుడి దురవస్థ కళ్ళబడేసరికి వెంకట్రామయ్య అమావాస్యనీ, తర్పణాన్నీ మరచిపోయి పచ్చికపైన తన పైపంచ పరచి కానుగ కొమ్మలతో తలగడ అమరించి రోగిని పంచపైన పడుకోబెడుతూ "ఏమైందండీ! ఎందుకిలా బాధపడుతున్నారు?" అని ప్రశ్నించాడు.

"ఎందుకైతే నీకేం లేవయ్యా? నువ్వేం ఆర్చేవాడివా" అంటూ ఆ వృద్ధుడు ముఖం మరోవైపుకు త్రిప్పుకున్నాడు.

"ఆర్చగలను, తీర్చగలను. మీ కెందు కా సందేహం! జబ్బేమిటో చెప్పండి. ఆ తరువాత చూద్దురుగాని" అన్నాడు వెంకట్రామయ్య.

రోగి యించుక విస్మయంతో వెంకట్రామయ్యని చూస్తూ, "నువ్వేం వైద్యుడివా?" అన్నాడు.

"అవును, నేను నాటువైద్యుణ్ణి; బ్రతుకు గడవడమే దుర్లభమైపోయిన నాటు వైద్యుణ్ణి నేను."

రోగి తనని పట్టి పీడిస్తున్న వ్యాధిని గురించి చెప్పాడు: "నాలుగేళ్ళయింది ఈ కడుపునొప్పి కనబడి! ఇదేం మాయదారి జబ్బో ఆ దేవుడికే ఎరుక! ఎన్నో మందులు తిన్నాను; నయం కాలేదు. నాలుగుసార్లు ఆపరేషన్ జరిగింది: గుణం కనిపించలేదు. నిన్నటి మానానికి ఉదయం నుంచీ సాయంత్రం వరకు నరకయాతన పడ్డానంటే నమ్ము. తెల్లవారి బస్సులో యిక్కడొకొచ్చాను. పెద్ద డాక్టరు గారుచూచి మళ్ళీ ఆపరేషన్ జరగాలన్నాడు. ఈసారి ఆపరేషన్ మాట వినేసరికి నా ఒళ్లు కంపించిపోయింది. ఈ బాధతో చచ్చిపోయినా సరే ఆపరేషన్ మాత్రం వద్దని మనసులో స్థిరపరచుకున్నాను. ఏదో వాళ్ళిచ్చిన మందు గుక్కెడు త్రాగి స్నానం చేస్తే ఏమైనా నొప్పి తగ్గుతుందేమోనని యిలా వచ్చాను. ఇక్కడికి వచ్చేసరికి నొప్పి మరింత తీవ్రమయింది. పన్నెండు గంటల నుంచీ యిక్కడే పడివున్నాను."

వెంకట్రామయ్య తన జీవితకాలంలో రోగులకోసం తయారు చేసిన మందులు చాలా తక్కువ. ఆయన దగ్గర రెండు మూడు సీసాల నిండుకూ ఏవో చూర్ణాలు కొన్ని, నాలుగైదు కట్టుమాత్రలు, ఒకటి రెండు లేహ్యాలు యింత మాత్రముండేవి. లెక్కా పక్కాలేని అసంఖ్యాకమైన రోగాలన్నింటికీ ఆయన ఈ మందుల్నే వాడేవాడు. అవి నయమైతే నయమయ్యేవి. లేకపోతే లేదు. తను రాజవైద్యుడని గానీ, ఇంగ్లీషు వైద్యాలు తన వైద్యంముందు బలాదూరనిగానీ వెంకట్రామయ్య ఎప్పుడూ సవాలుకు పోలేదు. అతనిది సహజంగా నమ్ర స్వభావం.

వెంకట్రామయ్య భుజంపైనుంచీ మందులసంచిని చేతికి తీసుకుని చుట్టుప్రక్కలా కలయజూచి ఏదో ఆకు పెరికి తెచ్చి ఒక చూర్ణాన్ని అందులో వేసి ఒక రాతిపైన దంచి, "బాబూ! వైద్యో నారాయణోహరిః అనుకుంటూ ఈ మందు కాస్త మ్రింగివేయండి. ఆ తరువాత మీ అదృష్టం. నా అదృష్టం" అన్నాడు.

విచిత్రం జరిగింది! మందు గొంతుక వెంట దిగజారిన పది నిమిషాల్లోనే రోగికి గుణం కనిపించింది. అతడు లేచి కూచుని వెంకట్రామయ్య వైపు తెల్లబోయి చూచాడు.

"ఏమండీ! కొంచెమైనా తగ్గిందా?" అన్నాడు వెంకట్రామయ్య.

"నిదానించు, చెబుతాను" అంటూ రోగి లేచి చెట్టు మొదలు కానుకుని కూర్చున్నాడు.

మెల్లమెల్లగా పది, ఇరవై, ముప్పై నిమిషాలు గడచిపోయాయి. రోగి ముఖంలో బాధా చిహ్నాలు క్రమక్రమంగా మాయమైపోయాయి. మనసు కృతజ్ఞతతో నిండిపోయిందేమో మరి, అతడు వెంకట్రామయ్యని దగ్గరికి పిలిచి తన ప్రక్క కూర్చోమన్నాడు. జేబులోనుంచీ రెండు పది రూపాయల నోట్లు తీసి అతడి చేతిలో పెట్టబోయాడు.

వెంకట్రామయ్య చేతిని వెనక్కి తీసుకుంటూ "అబ్బే! నా మందుకంత విలువెక్కడిదండీ? రెండో మూడో యిప్పించండి. అదే నాకు దండి! లేనిపోని దురాశలకు పోతే వైద్యం ఫలించదు బాబూ?" అన్నాడు.

డబ్బు జేబులో వేసుకుని రోగిష్టి వృద్ధుడు చేతులు జోడించి "అయ్యా వైద్యుడా! మనిషంటే నువ్వయ్యా మనిషివి" అన్నాడు.

"అబ్బే, అదేం కాదండీ! నాకూ ఆశ వుంది. కానీ మితిమీరకుండా జాగ్రత్త పడుతుంటాను" అన్నాడు వెంకట్రామయ్య.

"ఇదిగో, ఇలా చూడు, ఇదే యింకెవరైనా ఈ జబ్బు నింత త్వరగా నయం చేసివుంటే యాభై, అరవై యిచ్చేదాకా వదలి వుండేవారు కాదు. ఓయ్! లోకమంటే ఏమిటో తెలియని బైరాగీ! ఈ ఋజువర్తన వల్ల అన్నం దొరుకుతుందనుకోవడం శుద్ధ భ్రమ! యాచించడానికి వెళ్ళినప్పుడు కూడా దాత పెంపుసొంపులకు తగినంత దానాన్ని అడగాలన్నారే! నేను వ్రేలి వ్రేలికీ వేసుకున్న ఉంగరాల్ని చూచి, చేతుల్లో మెడలో తగిలించుకున్న బంగారం కంటెల్ని చూచి నువ్వు నేనిచ్చిన యిరవై రూపాయల్ని మారు మాట్లాడకుండా తీసి జేబులో వేసుకోగూడదూ! పోనీలే. నీకు ప్రాప్తి లేదు"

"మీరు కలిగినవాళ్ళు కాబట్టి మీ దగ్గర ఎంత గుంజుకున్నా ఫరవాలేదని నేననుకోలేను బాబూ! నా కష్టానికి ప్రతిఫలం నాకు ముట్టితే చాలు" అన్నాడు వెంకట్రామయ్య.

"ఈమాట మొదటిసారిగా నీనోట వింటున్నాను. షావుకారు రంగధామయ్యని గురించి నువ్వు విన్నావుకదూ! అతడికి బిడ్డలు లేరనీ, వడ్డీ వ్యాపారంలో అతడు అతడి తాత ముత్తాతలు గడించిన లక్షలకు ఉత్తరాధికారి లేడనీ, ఆ ఆస్తిని వీలైనంతవరకూ కాజేయడానికి అతడి మిత్రులు, బంధువులు ఎందరో ప్రయత్నిస్తున్నారనీ, ఈ విషయాలన్నీ ఈ ప్రాంతంలో ఎవరికి తెలియనివి? ఆ రంగధామయ్యని నేనే! ఏమయ్యా వైద్యుడా! ఇప్పుడైనా తీసుకుంటావా ఈ యిరవై రూపాయలు?" అంటూ రంగధామయ్య మళ్ళీ డబ్బు పైకి తీశాడు.

"ఇప్పుడేం తొందర! ఉండనివ్వండి బాబూ!జబ్బు పూర్తిగా నయమైం తర్వాత తీసుకుంటాను" అన్నాడు వెంకట్రామయ్య.

ఆరోజు సాయంత్రం బస్సులో వెంకట్రామయ్య రంగధామయ్యని వెంటబెట్టుకుని స్వగ్రామం చేరుకున్నాడు.

కల్యాణి వడ్డించగా ఇద్దరు వృద్ధులూ భోజనం చేశారు. నాగరాజు ఆరుబయట మంచాలు వేశాడు. వెన్నెల పాలారకాస్తోంది. రంగధామయ్య తాంబూలం నములుతూ వున్నట్టుండి తలపైకెత్తి "వెంకట్రామయ్యా! ఇలా నా మంచంపైకి వచ్చి కూచుంటావూ" అన్నాడు.

"ఏం బాబూ! మళ్ళీ కడుపునొప్పి ఏమైనా...." అంటూ వెంకట్రామయ్య దగ్గరికి వచ్చాడు.

"కాదులే. ఇది వేరే సంగతి.ఎందుకడుగుతున్నానో తరువాత చెబుతాగానీ, మొదట నా ప్రశ్నకి సమాధానం చెప్పు. మీరు ములకనాటి వారే కదూ!"

"అవునండీ!"

"గోత్రం, సూత్రం చెబుతావా!"

వెంకట్రామయ్య చెప్పాడు.

"అంతా సరిపోయింది. చూడు వెంకట్రామయ్యా, నీకేం ఆక్షేపణ లేకపోతే నేను మీ నాగరాజుని దత్తు తీసుకుంటాను."

"ఏమిటి బాబూ! ఏమన్నారు?" వెంకట్రామయ్య నోరు తెరిచింది తెరిచినట్టే వుండిపోయింది.

"ఎందుకో చెప్పలేను వెంకట్రామయ్యా! నీతో నాకు పరిచయం కలిగి ఒక్కరోజయినా కాలేదు. మీ యింట్లో అడుగుపెట్టి ఒక్క ఝామైనా కాలేదు. కానీ మీ కుటుంబం పట్ల నాకేదో మాటల్లో చెప్పరానంత ఆత్మీయత ఏర్పడిపోయింది. మీ అమ్మాయి నన్ను బాబయ్యా

అని పిలుస్తోంటే నా మనసు ఏ ఆనందలోకాల్లోనో తేలిపోయి నట్టయింది. శుభస్యశీఘ్రం అన్నారు. ఆమెకొక సంబంధాన్ని చూడు. ఇటు పెళ్ళి, అటు దత్త స్వీకరణ రెండూ ఒకేసారి జరిగిపోవాలి" అన్నాడు రంగధామయ్య.

వెంకట్రామయ్య కుమార్తెకి సంబంధంకోసం ఊళ్లన్నీ గాలించాడు. మంచి వరుడు గనుక కుదిరినట్టయితే తను స్వయంగా రెండు మూడు వేల రూపాయల కట్నం యిచ్చి, లక్షణంగా కళ్యాణి పెళ్ళి జరిపించగలనని రంగధామయ్య చెప్పినప్పటికీ, అతని డబ్బును తన కుమార్తె పెళ్ళి కట్నంకోసం వాడుకోవడం వెంకట్రామయ్యకు మనస్కరించలేదు. ఆదినుంచీ, ఆయన్ను అంటిపెట్టుకుని వుండిన అమాయకత్వం వరనిర్ణయంలో సైతం విడిచిపెట్టలేదు. టీచర్సు ట్రయినింగు స్కూల్లో ఉపాధ్యాయుడుగా తయారౌతున్న ఒక సన్నటి, మామూలు రకం అబ్బాయిలో తన అల్లుడికి కావలసిన లక్షణాలన్నీ వెంకట్రామయ్యకు కనిపించాయి.

ఒక శుభముహూర్తాన తిరుచానూరు మంగతాయారు పాదసన్నిధిలో ముద్దుల పెళ్లికూతురు కళ్యాణికీ, తారాజువ్వలా ఎప్పుడో ఒకనాటికి ఆకాశానికి ఎగరలేక పోతానా అన్నట్టు బిక్కుబిక్కుమని, శ్రీమంతులైన బంధువుల్ని చూస్తూ కూర్చున్న రాధాపతికీ పెళ్ళి జరిగిపోయింది.

అంతకు ముందురోజే నాగరాజు షావుకారు రంగధామయ్య గారి దత్తపుత్రుడూ, హఠాత్తుగా తనపై ప్రసరించిన శ్రీదేవి అనురాగ వీక్షణాల పన్నీటిజల్లు ఈ చెంపకూ ఆ చెంపకూ కొట్టడం వల్లనేమో ఉక్కిరి బిక్కిరై తబ్బిబ్బు పడిపోసాగాడు.

## 2

"ఇంకా ఎంతదూరముందబ్బీ ఊరు?"

నాగుల్ని అడిగింది కల్యాణి.

"ఎంతో ఎక్కడిదమ్మా! ఇదిగో ఈ గుట్టవుంది చూచారూ, దీన్ని దాటుకోగానే నిమ్మల చెరువు. చెరువు మరవ దాటుకుంటే చింతతోపు. తోపు దాటుకుంటే ఊరు!" అన్నాడు నాగులు.

డొంక దారిలో బండి పడుతూ లేస్తూ పోతున్నది. తెట్టెలు గట్టుకుని లోకాన్ని ముట్టడించిన కారుచీకట్లు వున్నట్టుండి మాయమైపోసాగాయి. తూరుపుకొండ శిఖరంపైన ఆకాశం క్రమక్రమంగా ఎరుపెక్క సాగింది. చల్లగా చంద్రుడు పైకి వచ్చి ప్రకృతికి గిలిగింతలు పెట్టాడు.

వెన్నెల సర్వసామాన్యంగా ప్రాణులన్నింటికీ ఆనందదాయిని. అది విషాదభరితమైన కళ్యాణి హృదిలో కూడా గతించిపోయిన కొన్ని మధురానుభూతుల స్మృతుల్ని పైకి తోడింది.

ఆరోజు రాత్రి....

ఆమెకు పెళ్ళయి యింకా ఒక నెల కూడా కాలేదు. భర్త ఊరి నుంచి వచ్చాడు. అతడి రాకకోసం అప్పుడామె ఎదురు చూడలేదు. న్యాయానికతడు పది రోజుల తర్వాత వచ్చి వుండవలసింది. ఆ రాత్రి కూడా వెన్నెల కాసింది. సరిగ్గా ఇలాంటి వెన్నెలే! ఇంటివెనుక జాజిమల్లె పందిరి క్రింద కూర్చున్నప్పుడు "ఏమండీ! వస్తున్నట్టు జాబైన వ్రాశారుకారే?" అని ఆమె అడిగింది. రాధాపతి ఇలా అన్నాడు: "రాకపోకలన్నీ నా నిర్ణయం పైనే జరిగితే, నా నిర్ణయాన్ని ఎప్పటికప్పుడే నీకు తెలిపేవాడిని కల్యాణీ! నేను బొత్తిగా అస్వతంత్రుడినై

పోయాను. ఏదో ఒక యింద్రజాలం ప్రభావానికి నేను లోనై పోయాను. ఈ యింద్రజాల మెక్కడుందో చెప్పమంటావా? నీలో, స్పష్టంగా చెప్పాలంటే నీ కళ్ళలో."

సిగ్గుపడిపోయింది కల్యాణి!

రాధాపతి అప్పటికీ యిప్పటికీ వెన్నెల్లో కూచున్నప్పుడల్లా ఆ మాట చెబుతూనే వుంటాడు.

అందుచేత ఆ మాట పాతబడిపోలేదు. ఆ అనురాగం, ఆ ఆదరం ఇంకా కల్యాణికి నిత్యనూతనంగానే ఉంటాయి.

కానీ కాలం గడిచిపోయింది. జీవితం కల్యాణి అనుకున్నంత సౌఖ్యావహం మాత్రం కాలేదు. సంతానం కోసం ఏడుకొండలెక్కి ముడుపు చెల్లించకముందే, ఇరుగింటి పొరుగింటి బిడ్డల్ని చంకకెత్తుకుని పసిపాపల సాన్నిధ్యంలో బ్రతుకెంత హాయిగా గడచిపోగలదని ఊహాగానాలు సాగించక ముందే ఆమె యిద్దరు బిడ్డల తల్లయింది. నెల కరవైరూపాయల సంపాదనతో పల్లెగాక పట్నమూగాని పేట కొంపలో వంటచెఱకునుంచీ, పాలడబ్బాల వరకూ అన్నీ కొనుక్కుంటూ బ్రతుకు నీడ్చడం ఆమెకి భారంగా తోచడానికి ఎంతోకాలం పట్టలేదు.

బ్రతుక లేకపోతే బడిపంతుళ్ళయ్యేవారట మునుపెప్పుడో! ఇప్పుడా వుద్యోగం దొరకడానికి కూడా బ్రహ్మ ప్రయత్నం కావలసివస్తోంది. ట్రెయినింగు అయినప్పటినుంచీ, ప్రయత్నించగా ప్రయత్నించగా ఒక డిస్ట్రిక్టు బోర్డు ఛాన్సు దొరికింది. ఆ ఛాన్సు దొరికిన మూడు నెలలకే వేసవి సెలవులొచ్చాయి. సెలవుల్లో జూనియర్‌మోస్టు టీచర్ల నందరినీ ఊస్టుచేసి పారేశారు.

ఆ తరువాత రాధాపతి ఎక్కడైనా స్వంతంగా ఒక స్కూలు ప్రారంభించుకుంటే బాగుంటుందోమోనని తలపోశాడు. ఎయిడెడ్ స్కూళ్ళ మీద ప్రభుత్వానికి చిన్న చూపన్నమాట నిజమే అయినా బాగా కృషి చేసే వుపాధ్యాయుడికి అలాంటి స్కూళ్ళల్లో ప్రతిఫలం ముట్టకపోదనే నమ్మకంతో అతడు దాదాపు రెండువేల కడపవరకూ వున్న ఒక వూళ్ళో స్కూలు ప్రారంభించి రికగ్నిషన్ తెప్పించుకున్నాడు. ఈ ఎయిడెడ్ స్కూలుకూ, అంతకు పూర్వంనుంచీ వున్న బోర్డు స్కూలుకూ ఆదిలో కొంచెం పోటీ చెలరేగి రానురానూ తగ్గిపోయింది. విద్యాబోధనలో ఎయిడెడ్ స్కూలుకు ప్రథమ స్థానం లభించినప్పటికీ, అత్యవసరాలైన బోధనోపకరణాలు సైతం లేకపోవడంవల్లనూ, కట్టడం బొత్తగా పాతబడిపోయి శిథిలావస్థలో వుండడం వల్లనూ, అదిపై అధికారుల మన్ననకు నోచుకోలేక పోయింది. ఎలాగైనా ఒక అయిదు వందల రూపాయలతో అయిదంకణాల వూరి కొంపయినా వేసుకోకపోతే పాఠశాలని చెట్లక్రింద నడపవలసిన దుర్గతి తటస్థించుతుందేమోనని రాధాపతి లోలోపల తపించిపోసాగాడు.

"ఏం కల్యాణీ! మీ అన్నయ్య నింతవరకూ మన మెప్పుడూ యాచించలేదు. ఇప్పుడైనా మనం ఆయన్ని ఉచితంగా యివ్వమని అడుగ బోవడం లేదు. అప్పుగా అయిదు వందల రూపాయలివ్వమను. కావాలంటే వడ్డీ కూడా...." కల్యాణి ముఖంలో అలముకుంటున్న కోపచ్ఛాయల్ని చూచి రాధాపతి అర్ధోక్తిలోనే ఆగిపోయాడు.

"చెప్పండి. చెప్పండి. నిలిపేశారెందుకు? మనం యిచ్చే వడ్డీతోనే గదా ఆయన బతుకు సాగుతోంది! ఐనా యింత పుల్ల విరిచినట్టు మాట్లాడ గూడదండీ!" అంది కల్యాణి.

"అదిగో! అప్పుడే భద్రకాళిలా మారిపోతే నేనేం చెప్పను! నేనిప్పుడు మాట్లాడుతున్నది మీ అన్నయ్యతో కాదు; నీతో. ఆయన వుచితంగానే మన కాడబ్బు యివ్వగలిగితే మరీ సంతోషం."

కల్యాణి ఫలానా రోజు సాయంత్రం రానున్నదనీ, స్టేషనుకి బండి పంపించమనీ రాధాపతి నాగరాజుకు జాబు వ్రాశాడు.

## 3

చెరువుకట్ట మీద బండి హఠాత్తుగా ఆగింది. ఎద్దులు బెదరి బండిని దారి తప్పించబోయాయి. నొగమీద కూచున్న నాగులు అసాధ్యుడు. అతడు పగ్గాలు బిగబట్టి వలపటెద్దుని అడుగెత్తి ముందుకు పెట్టనీయకుండా ఆపి, దాపటెద్దుని వీపుమీద చరచి "ఈ పాడు చెరువు కట్టపైన పుట్టలు బలిసిపోతున్నాయండమ్మ గారూ! నేను చూస్తూనే వున్నానుగా, ఈ పుట్టల్లో కోడెత్రాచులు బుసకొడుతుంటాయి. ఒకటిప్పుడిలా పరుగెత్తింది. ఎద్దులు బెదిరిపోయాయి" అన్నాడు.

"పాము ఎదురయిందా నాగులూ! అయ్యో, అది అపశకునమే!" అంది కల్యాణి.

"ఆఁ! శకునాల్నెవరు నమ్ముతారండమ్మా ఈ కాలం! బాబుగారు ఎక్కడికైనా బయల్దేరుతారనుకోండి. పెంపుడు పిల్లి అడ్డంరాకుండా వుండదు. అది వచ్చింది కదా అని ఆయన పని చెడిపోయిందెప్పుడు? ఆదంతా ఒక పిచ్చి" నాగులు ఒక్క ఉదాహరణంతో శకున శాస్త్రాన్ని కొట్టిపారేశాడు.

కల్యాణి బిక్కు బిక్కుమంటున్న గుండెతో చెరువు కట్టపైన పుట్టల్ని చూడసాగింది. పుట్టల వెనుక, నిండిన చెరువుపై నుంచీ, కట్టక్రింద కనుచూపానేదాకా పండి సాపుగా క్రిందికి వ్రాలిన వరిమళ్ళపై నుంచీ చల్లని గాలి మెల్లగా వీస్తోంది. ఆ చెరువునిండి ఆ పొలాలు పండితే చనిపోయిన రంగధామయ్య కట్టించిన గరిసెలు నాలుగూ నిండుతాయి. ఊళ్ళో రావిచెట్టు క్రింద నెలకొన్న వున్న రాములవారి భజనగుడి తాలూకు అర్చకమాన్యమూ మంగలిమాన్యమూ మినహాయిస్తే మిగతా పొలాలన్నింటినీ కొనివేసి ట్రాక్టర్లతో కయ్యలను తీర్పించి వానకోసం ఎదురుచూస్తూ కూచోవలసిన అవసరం లేకుండా రెండు పెద్దబావుల్ని త్రవ్వించి రంగధామయ్య తన వారసుడికా చెరువుక్రింద ఒక అమూల్యమైన ఆస్తిని సంపాదించిపెట్టాడు. రంగధామయ్యగానీ అతడి పూర్వులు గానీ ఏ పనిచేసినా అలాగే చేశారు. ఇళ్లు కట్టాలనుకుంటే నాలుగైదు మహిడీలకు సరిపోగల కర్రసామాన్లను దూలాలుగా త్రావులుగా తలుపులుగా ద్వారబంధాలుగా తీర్పించి కొట్టాల్లో పదిలం చేశారు. ఒకపూరిపాక వేస్తే సరిపోయే చోట మంగుళూరు పెంకులు తెప్పించి శాశ్వతంగా వుండిపోయేటట్టు పెద్ద పెద్ద కొట్టడీలు కట్టారు. వెండి సామానుపైన మోజు పడినప్పుడు వీశలు వీశలుగా వెండికొని బత్తుళ్ళచేత పాత్రలు పళ్లెరాలు చేయించారు. ఇక బంగారం సంగతి సరేసరి! నిర్దిష్టంగా వివరాలెవరికి తెలియవు గానీ ఆ యింట్లో బంగారు వుంగరాలు మాత్రం ఒక్క శేరు నిండుకూ వున్నాయని అమ్మలక్కలు ఆశ్చర్యంతో చెప్పుకోవడం పరిపాటి.

బండి చెరువుమరవలో దిగుతుండగా బాబులేచి కూచుని "ఇంకా ఎంతదూరం పోవాలమ్మా?" అన్నాడు.

కల్యాణి చెదిరిపోయిన బాబు ముంగురుల్ని సవరిస్తూ "ఊరి దగ్గరికి వచ్చేశాం బాబూ! అదుగో, ఆ చింతచెట్టు సందులోనుంచీ మామయ్య గారి మేడ కనబడుతోంది చూడు" అంటూ దూరంగా ఎక్కడో గంభీరంగా నిలిచివున్న మూడంతస్తుల మేడపైని గదిలోనుంచీ కిటికీ ద్వారా బయటపడుతున్న దీపపు వెలుగుని కుమారుడికి చూపించింది.

భజన గుడి ముందర మండపంలో మేనువాల్చి గత జీవితంలోని మధురస్మృతుల్ని నెమరు వేసుకుంటున్న వృద్ధులిద్దరు ముగ్గురు, ఎద్దుల బండిని చూచి మిద్దింటివారి బంధువు

లెవరో వస్తున్నారనుకున్నారు. ఇంకా తిండిపైన ఆశ వదలుకోలేక ఊళ్ళో ఆ చివరనుంచీ ఈ చివరకు గస్తీ తిరుగుతున్న కుక్కలు బండిని చూచి మొరగబోయి నాగుల్ని పోలికబట్టి తోకాడించుకుంటూ వెళ్లిపోయాయి.

బండి యింటి ముందు నిలిచింది. నాగులు నొగపై నుంచి క్రిందికి దూకి ఇనుపతలుపులు తెరచి బండిని లోపలికి తోలాడు. వెన్నెల వెలుగులో కల్యాణికి భవనం స్పష్టంగా కనిపించింది. రంగధామయ్య చనిపోయినప్పుడు కల్యాణి ఆ యింటి కోసారి వచ్చింది. ఆయన చనిపోయిన తర్వాత రెండు మూడేళ్లు గడచిపోయాయి. రంగధామయ్య ఆ భవనం కట్టించడంలో ఎంత పట్టుదల చూపాడో, దాన్ని నాజూకుగా వుంచుకోడంలో అంత పరామరిక వహించాడు. ఆయన హయాంలో ఆ మేడ చుట్టూ గడ్డీగాదమూ చిందరవందరగా పడివుండేవి. వరండాలో చింతపండు బస్తాలు, వేరుశనగ మూటలు చెల్లాచెదురుగా పడివుండేవి. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. నాగరాజు పట్టణం నుంచీ రకరకాల క్రోటన్సు మొక్కలు తెప్పించి ఇంటిచుట్టూ పాతించాడు. సింహద్వారం నుంచీ వరాండా వరకు మల్లెపందిరి అల్లించాడు. కాంపౌండుగోడ ప్రక్కన సీమబాగిచెట్టు నాటించాడు. ఇన్ని హంగులకూ తలమానికంగా మేడపైన గోడలో మెరిసి పోయే అక్షరాలతో 'శేష్ మందిరం' అని పేరు వ్రాయించాడు.

నాగరాజు భార్యపేరు శేషమ్మ. భర్త ఆమెను ముద్దుగా 'శేషమాంబా' అని పిలుస్తాడు.

నాగులు ఎద్దుల్ని కొట్టంలో కట్టి బండి దగ్గిరికి వచ్చాడు. కల్యాణి రవిని చేతుల్లోకి తీసుకుని బండిదగ్గరే నిలబడి వుంది. తన రాకపట్ల ఆ యింట్లో యించుక సంభ్రమమైనా లేదన్న విషయాన్ని ఆకళించుకుంటూ నిరుత్సాహంతో విగ్రహంలా అక్కడే నిలబడివున్న కల్యాణి నాగులు దగ్గరికి రాగానే "తలుపు వేసినట్టుంది నాగులూ!" అంది.

"వేసేస్తే నేమమ్మా! తట్టి పిలుస్తానుండండి" అంటూ నాగులు మెట్లెక్కి ద్వారం దగ్గరికి వెళ్ళి "అమ్మగారూ, అమ్మగారూ" అంటూ తలుపు తట్టసాగాడు.

అతడి పిలుపు ముఖద్వారం దాటి, హాలుదాటి, మేడమెట్లు దాటి రెండో అంతస్తులో ఎక్కడో రేడియో వింటూ కూర్చున్న శేషమాంబ వీనుల్లో జొరబడకముందే, వరండాకు వామభాగంలో వున్న గది తలుపు తీసుకుంటూ నైట్ డ్రెస్సులో వున్న యువకుడొకడు బయటికి వచ్చి "ఏమిట్రా నాగులూ! ఎవరొచ్చారేమిటి?" అన్నాడు.

"కల్యాణమ్మగా రొచ్చారండీ" అన్నాడు నాగులు.

"ఓహో! నువ్వా కల్యాణీ! చాలా మారిపోయినట్టున్నావే" అంటూ ఆ యువకుడు మెట్లమీదికి వచ్చి కల్యాణి ముఖం చూడసాగేడు.

"మారి పోయానంటావా వాసూ! నీ మగత కళ్లకు నేను సరిగ్గా కనిపించడం లేదేమో!" అంటూ కల్యాణి ముఖం మరోవైపుకు త్రిప్పుకుంది.

వాసు వెనుదిరిగి ద్వారం దగ్గిరికి వెళ్లి తలుపు దబదబా బాదుతూ "అక్కయ్యా! అక్కయ్యా! నీ మరదలొచ్చింది" అంటూ కేకవేశాడు.

ఉల్లిపొరలాంటివాయిల్ చీరలో, అల్లనల్లన అడుగులు వేసుకుంటూ గాలిలో తేలిపోయే తెల్లని మబ్బులా బయటికి వచ్చిన శేషమాంబని చూడగానే బాబు 'అత్తయ్యా' అంటూ ఆమె కాళ్ళకు చేతులు పెనవేసుకున్నాడు. శేషమాంబ వాడినెత్తుకోబోతూ "ఐతే కల్యాణీ! ట్రెయిన్ లేటుగా వచ్చినట్టుంది కదూ!" అంది.

"అవునొదినా! లేటుగానే వచ్చింది. ఐనా ఈపాటికి మీరు తలుపులు మూసుకుని నిద్రపోయి వుంటా రనుకోలేదు" అంది కల్యాణి.

"నిద్రపోతే మాత్రమేం! నీకోసం అన్ని ఏర్పాట్లూ చేసి వుంచాను. హాలు పక్క ఉన్న గది నీ కోసం ఖాళీ చేయించాను. వంటలక్కతో పది గంటలవరకూ అన్నంలో నీళ్ళు పోయవద్దన్నాను. అంతా రెడీగా వుంది. నువ్వు కాళ్ళు కడుక్కో! ఓరే నాగులూ! నువ్వా రంగమ్మ ఎక్కడుందో చూచి, లేచి కల్యాణికి అన్నం వడ్డించమను. ఇదేమిట్రా వాసూ! జలుబు చేసిందన్నావే. మంచులో ఎందుకు నిలబడ్డావ్! వెళ్లి పడుకో. అన్నట్టు దోమతెర వేసుకున్నావు కదూ, దోమలురా బాబూ దోమలు! ఒకటి కుడితే చాలు మలేరియా వచ్చేసిందనుకో! రా కల్యాణీ! ఇప్పటికే అర్ధరాత్రి దాటి పోయినట్టుంది."

కల్యాణి లోపలికి వెళ్ళింది. రంగమ్మ విస్తరి వేసి అన్నం వడ్డించగా తిన్న శాస్త్రం ముగిసింది. ఆమె భోజనం పూర్తయేంత వరకూ హాల్లో కూర్చుని పేపరు చదువుకుంటూ ఉన్న శేషమాంబ "అప్పుడే భోం చేశావా కల్యాణీ! అన్నం తినడంలో కూడా పొదుపరితనం నేర్చుకుంటున్నావల్లే ఉంది. పోనీలే, అదీ మంచిదే! అన్నగారి సంగతి చెప్పావు కావు. బాగున్నారు కదా!" అంది.

"బాగానే వున్నారు వదినా?" అంది కల్యాణి.

"ప్రయాణం వల్ల అలసిపోయినట్టున్నావు. పడుకో. తీరిగ్గా తెల్లవారి మాట్లాడుకోవచ్చు" అంటూ శేషమాంబ దీపం చిన్నదిగాచేసి మేడమెట్లవైపు పోసాగింది.

"ఐతే వదినా! అన్నయ్య ఇంట్లో లేడేమిటి." అంటూ ఒక చిన్న సందేహాన్ని వెలిబుచ్చింది కల్యాణి.

"ఉన్నారమ్మా వున్నారు. అది నీ అదృష్టమనుకో. ఎప్పుడూ మదరాసనీ, కర్నూలనీ, అదనీ ఇదనీ ప్రయాణాలే కదూ! ఎక్కడికో వెళ్ళి మధ్యాహ్నం తిరిగొచ్చారు. నిద్రపోయినట్టుంది. లేపమంటావా" అంది శేషమాంబ.

"ఎందుకులే వదినా, నిద్రపోనీ" అంది కల్యాణి వంచిన తల పైకెత్తకుండానే.

శేషమాంబ పైకి వెళ్లిపోయింది. కల్యాణి బిడ్డల్ని తీసుకుని గదిలోకి వెళ్లి పడకపైన మేనువాల్చింది. చీకటీగలు ఝుమ్మని రొదచేస్తున్నాయి.

అవి తనని మాత్రం కరవ్వనీ, కరచినా తనకు మలేరియా రాదనీ కల్యాణి అనుకోలేకపోయింది.

## 4

కల్యాణి అన్నగారింటికి వచ్చిన తర్వాత పదిరోజులు మెల్లగా దొర్లిపోయాయి. ఆ పది రోజుల్లోనూ ఆమెకు పదిపదుల నూరు అనుభవాలు కలిగాయి. ఆ ఇంట్లో మానవులందరూ రెండు వర్గాలుగా విభజింపబడడానికి వీలుగా తయారైవున్నారు. మొదటి వర్గానికి సంబంధించినవారు తామేమో ఏదో పైలోకాలకు చేరిన వారైనట్టు. వినోదానికో, విలాసానికో ఈ లోకంలో కాస్త విశ్రాంతి తీసుకుంటున్నట్టు భావిస్తారు. ఇక రెండోవర్గం వారు, తాము మానవజాతిలో ఏదో అధమాధమస్థాయికి చెందినవారైనట్టు, మొదటి వర్గం వారి కనుసన్నల్లో కీలుబొమ్మలై వర్తిస్తున్నారు. కల్యాణికీ తారతమ్యం విడ్డూరంగానూ, కృత్రిమంగానూ కనిపించింది.

ఆ పదిరోజుల్లోనూ కల్యాణికి నాగరాజు నాలుగైదుసార్లు మాత్రం కనిపించాడు. ఆమె ఆ యింటికి వచ్చిన మరునాటి ఉదయాన అతడెక్కడికో ప్రయాణమై మేడమెట్లు

దిగుతూ గది తలుపు దగ్గర ప్రత్యక్షమైన కల్యాణిని చూచి "ఎప్పుడొచ్చావు కల్యాణీ! జాబులో వ్రాసినట్లు రాత్రే వచ్చేశావన్నమాట! అరరే, స్టేషనుదగ్గరికి బండి పంపడం మరచిపోయానుగదూ!" అన్నాడు.

"నువ్వు మరచిపోయినా వదిన నన్ను మరిచి పోతుందా అన్నయ్యా! స్టేషను దగ్గరికి బండి వచ్చింది" అంది కల్యాణి.

నాగరాజు హాల్లో కుర్చీలో కూర్చుంటూ "బంధువుల విషయంలో మీ వదిన చాలా జాగ్రత్త తీసుకుంటుంది కల్యాణీ! ఆమె లేకపోతే ఈ యింటికి బంధువులు రావడమే చాలించుకుందురేమో! నేను రాను రానూ మందమతినై పోతున్నాను" అంటూ తన మతిమరపుకు నొచ్చుకున్నాడు.

కల్యాణి మౌనంగా అన్నగారి ముఖంలోకి చూస్తూవుండిపోయింది. చూస్తూ వుండగా ఆమెకెన్నో సందేహాలు కలిగాయి. పెళ్ళిగాక ముందు తనని చూచి "కల్యాణీ! అమ్మ ఎప్పుడో చనిపోయింది. నిన్ను చూస్తున్నప్పుడల్లా అమ్మ నాకు జ్ఞాపకమొస్తుంది. పెళ్ళయి నువ్వు అత్తగారింటికి వెళ్ళిపోతే, ఆ తరువాత ఈ యిల్లు భూతగృహమై పోతుందనుకో! ఆపైన ఇక్కడ నేనూ, నాన్నగారూ ఎలా కాలం వెళ్ళబుచ్చగలమో తలుచుకుంటే గుండె కుతకుత లాడిపోతుందనుకో" అని దురపిల్లిన ఆ అన్నయ్యేనా యితడు!

కల్యాణి కళ్ళు నీళ్ళతో నిండాయి. అంతలో నాగరాజు "అదేం కల్యాణీ ఒంటరిగా వచ్చావు! బావగారేం చేస్తున్నట్లు?" అని ప్రశ్నించాడు.

"ఆయనకు సెలవు దొరకదన్నయ్యా!" అంది కల్యాణి.

"సెలవు దొరికినప్పుడు రమ్మన్నానని చెప్పు" అంటూ నాగరాజు లేచాడు.

వెళ్ళిపోతున్న నాగరాజుని చూస్తూ అక్కడే నిలుచుండి పోయింది కల్యాణి. రాగానే వదినే ఆమెని పరామర్శించింది. మరునాటి వుదయం అన్నయ్య పరామర్శించాడు. కానీ ఈ పరామర్శల వెనుక అవ్యాజానురాగంతో నిండిన హృదయాలున్నాయా , లేవా? ఈ సందేహానికి కల్యాణి సమాధానం చెప్పుకోలేక పోయింది.

తనకోసం రెండో అంతస్తులో ప్రత్యేకించుకున్న గదిని విడిచిపెట్టి శేషమాంబ ప్రతిరోజూ నాలుగైదు సార్లయినా క్రిందికి వస్తుంది. వచ్చినప్పుడల్లా "ఏమమ్మా కల్యాణీ! నిద్రపోతున్నావా" అనో, "ఏమమ్మా మరదలా! చదువుకుంటున్నావా" అనో కల్యాణిని పలకరిస్తుంది. వదినా మరదళ్ళిద్దరూ హాల్లో కూర్చుంటారు. ఇంతలో ఏ నౌఖరో, ఏ సేద్యగాడో, ఏ దుకాణదారో అమ్మగారి కోసం అక్కడికి వస్తాడు. ఒకసారి బస్తీనుంచి బట్టల వర్తకుడొకడు వచ్చాడు. శేషమాంబ అతడిపైన విరుచుకపడింది. "నువ్విచ్చిన చీరల్లో చాయ వుండి ఏడిచిందొక్కటీ లేదు. చూడమ్మా కల్యాణీ! ఈ చీర అరవై అయిదు రూపాయలని యిచ్చిపోయాడు. నాలుగు చలవల కెళ్ళి వచ్చిందంతే! చూడు. పైనవున్న పువ్వులన్నీ చెదరిపోయి అచ్చం గ్లాస్కో మల్లులా తయారైంది. అబ్బబ్బ! ప్రపంచమంతా మోసంతో నిండిపోయింది." ఇలా సాగింది ప్రసంగం. వర్తకుడు తెల్లబోయి "ఆ చీర నేనిచ్చింది కాదమ్మా" అని మొరబెట్టుకున్నాడు. అతడి మొర ఆలకిస్తూ కూచోడానికి శేషమాంబ అంతతీరికున్న మనిషేంకాదు. "ఇప్పుడు బట్టలు కొనే ఉద్దేశం లేదు. పది పదిహేను రోజులు తాళిరా" అన్నాదామె. వర్తకుడు పై గుడ్డ విదిలించి బుజాన వేసుకుని, మూట తలపైనబెట్టుకుని వెళ్ళిపోయాడు.

వర్తకుడు దూరంగా వెళ్ళిపోయిన తర్వాత శేషమాంబ గొల్లున నవ్వి "ఏం కళ్యాణీ! చూచావా ఎదుటిమనిషి ఎలా డంగైపోయాడో! అమ్మో! కొంచెం చొరవ యిచ్చామంటే యిలాటి ఆసాములు ఇంటిని గుల్లచేసి పారేస్తారనుకో. ఒక వారం క్రిందట ఒకసారి వచ్చాడు. అప్పుడు మూడు వందల రూపాయలైంది బిల్లు. మళ్ళీ యిక్కడేమో పారిపోయినట్టు అప్పుడే వచ్చేశాడు. ఈ చీర ఇతడిచ్చింది కాదులే! ఊరికే దబాయించేశాను" అంది.

కల్యాణి నిర్ఘాంత పోయింది!

రోజు లొక్కొక్కటిగా గడవనూ గడవనూ కల్యాణి కాయింట్లో యింకా ఎన్ని రోజులుండవలసి వస్తుందోనన్న బెంగ పట్టుకుంది. ఐతే ఆమె అక్కడ ఎంతోకాలం వుండడానికి కూడా పరిస్థితులు అనుకూలించలేదు.

ఒకరోజు సాయంకాలం ప్రొద్దుపోక కల్యాణి మేడముందర పందిరి క్రింద కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటోంది. ఏ ఊరికో వెళ్ళిన నాగరాజు యింకా తిరిగి రాలేదు. ఒళ్ళు జబ్బుగా వుందని శేషమాంబ ఆ రోజంతా మేడపైనుంచీ క్రిందికి దిగలేదు. బాబు ప్రక్కింటివారి అబ్బాయితో ఆడుకోడానికి వెళ్ళాడు. రవి కప్పుడే నిద్ర పట్టింది. కల్యాణి కెందుకో ఆరోజు వుదయం నుంచీ మనసు బాగుండలేదు. కళ్ళు పుస్తకంపైనే వున్నప్పటికీ మనసుమాత్రం ఎక్కడో సంచరిస్తోంది.

"ఒంటరిగా మిగిలిపోయావేం కల్యాణీ!" వాసు వీధిలోంచి వస్తూ పలకరించాడు.

కల్యాణి తల పైకెత్తింది. ఫుట్‌బాల్ ఆటగాడి దుస్తుల్లో వాసు కనిపించాడు. ఒకటి రెండు క్షణాలు ఊరుకుని కల్యాణి మాటవరుసకు "కూచో వాసు" అంది.

వాసు కల్యాణి కూర్చున్న బెంచీపైన్నే ఒక వారగా కూర్చుంటూ గాఢంగా ఒక నిట్టూర్పు విడిచి కల్యాణివైపు జాలిగా చూచాడు. ఆ చూపుల వెనుక ఎలాంటిభావం నిక్షిప్తమై వున్నదో తెలీక కల్యాణి "ఏం వాసూ! నిట్టూర్పు విడుస్తున్నావు" అంది.

"ఈ ప్రపంచంలో కొన్ని అనుచిత కార్యాలు జరిగిపోతుంటాయి కల్యాణీ! అందువల్ల కొందరి జీవితాలు అడవిగాచిన వెన్నెల్లా వ్యర్థమై పోతుంటాయి. నాకు విధి, కర్మ మొదలైన వాటిపైన నమ్మకం లేదు. మానవులకు దూరదృష్టి లేకపోవడమే ఈ అనర్థాలన్నిటికీ కారణం."

మానవ జీవితాన్ని గురించి వాసుకు యింత తీవ్రంగా ఆలోచించవలసిన అవసరమేమొచ్చిందో కల్యాణి గ్రహించలేకపోయింది. తన బ్రతుకును ప్రయాణాలకు, సినిమాలకు, క్రికెట్టు పందాలకు మీదుకట్టిన వాసు, క్వెట్టాలో భూకంపం జరిగినా, గోదావరి వరదల్లో మనుషులు కొట్టుకుపోయినా, గోవాలో సత్యాగ్రహుల్ని నిలబెట్టి కాల్చివేస్తున్నా నిట్టూర్పు విడువని వాసు, ఉన్నట్టుండి తన ధోరణికి విరుద్ధమైన భావాల్ని బయటపెట్టేసరికి కల్యాణి తెల్లబోయింది కూడా!

"నలభై ఎనిమిదిలో ననుకుంటాను. నిన్ను మొదటిసారిగా పెళ్ళి పీటలమీద చూచాను. చూడగానే నా మనసు చివుక్కుమంది కల్యాణీ!" ప్రారంభించాడు వాసు.

"ఎందుకూ?" అప్రయత్నంగా ప్రశ్నించింది కల్యాణి.

"చెబుతాను. ఒక రత్నం వుందనుకో. అది మహారాజు కుటుంబంలో నైతే శోభిస్తుంది. నేలపైన విసిరివేస్తే యేమౌతుంది చెప్పు?"

"అంటే?"

"నువ్వేమైనా అనుకో కల్యాణీ! నీకు వరుణ్ని నిర్ణయించడంలో మీ నాన్నగారు చాలా పొరబడ్డారు."

"చూడు వాసూ! ఈ విషయంలో పొరబడుతున్నది నువ్వే. మా నాన్నగారు కాదు. మా వారిని గురించి నువ్విలాంటి విపరీత నిర్ణయానికెలా వచ్చావో నా కర్థం కావడం లేదు! అలాంటివారు మగవాళ్ళలో నూటికి కోటికి ఒక్కరుంటారు."

"ఇదంతా ఆత్మవంచన కల్యాణీ! చేత డబ్బు లేనివాడు, బ్రతుకు గడవాలంటే పదిమంది సహకారం కావలసినవాడు తప్పనిసరిగా మంచి వాడుగానే వుంటాడు. మంచి తనమనేది అసమర్థతకు పర్యాయపదమని నా వుద్దేశం."

కల్యాణి వాసుని చురచురా చూచింది. ఆ చూపుల్లోని అర్థాన్ని ఆకళించుకునే పాటి వివేకం వాసుకి లేదు. "అదీగాక కల్యాణీ!" అంటూ మళ్లీ తన ప్రసంగాన్ని కొనసాగించబోయాడు.

"నాకు తలనొప్పిగా ఉంది వాసూ! పోయి పడుకుంటాను" అంటూ కల్యాణి లోపలికి వెళ్ళిపోయింది.

తుఫానులో అల్లకల్లోలమైపోయిన ప్రకృతిలా కల్యాణి మనసు ఆందోళితమై పోయింది. తన భర్తను గురించి హీనంగా మాట్లాడేంత చొరవ అతడికెలా కలిగింది? ఏ అండచూచుకుని అతడంత ధైర్యంగా మాట్లాడగలిగాడు? అలా మాట్లాడడంలో అతడి ఉద్దేశమేమిటి?...గోడ గడియారం ఎనిమిదిసార్లు మ్రోగేంతవరకూ కల్యాణి ఆలోచిస్తూ ఉండిపోయింది. ఐనా ఆలోచనలు తెమల్లేదు. హాల్లో అడుగుల సవ్వడి వినిపించడం వల్ల ఆమె లేచి కూర్చుంది. ఒకవేళ ఆ వచ్చింది నాగరాజేమో ననుకుంది. కానీ అతడు రాలేదు. వచ్చినవాడు వాసు. అతడు ద్వారం దగ్గర నిలబడి "పుస్తకం బెంచీపైన మరచిపోయావు కల్యాణీ" అంటూ దాన్ని గదిలోని స్టూలుపైన వుంచి బయటికి వెళ్ళిపోయాడు. ఆ రావడం లోనూ పోవడంలోనూ కల్యాణి కేదో అనుమానం తగిలింది. వాసు శారీరకంగా యెంతటి బలవంతుడో మానసికంగా అంత దుర్బలుడు. మనసు ప్రభావం శరీరంపైన ఎప్పుడూ ఉండనే ఉంటుంది. గదిలోకి వచ్చినప్పుడు వాసు ముఖంలో కత్తివ్రేటుకు నెత్తురు చుక్క లేకపోవడం కల్యాణి గమనించింది. అతడేదో అకార్యం చేసివుంటాడు. ఏమిటది? ఒకానొక సందేహంతో కల్యాణి పుస్తకాన్ని చేతికి తీసుకొని పుటలు తిరగవేసింది. ఆమె సందేహం వృథాగా పోలేదు. అక్షరాలా నిజమైంది.

"కల్యాణీ! నువ్వు నా మనోవేదన గ్రహించి వుంటావనుకున్నాను. కానీ నువ్వేమీ తెలియనట్లే మాట్లాడుతుంటే, నా హృదయం తుత్తునియలై పోతోంది. నేనొక పశువులా ప్రవర్తిస్తున్నానని నువ్వనుకోవచ్చు. కానీ, ఏం చేయమంటావు! ప్రేమ గుడ్డిది కదా!"

ఆ క్షణంలో కల్యాణి మనోవీధిలో ఎలాటి భావాలు చెలరేగాయో ఊహించడమంత సులభసాధ్యమైన పనికాదు. ఆమె ఉన్మత్తురాలిలా ఒక్కసారి విరగబడి వికటంగా నవ్వాలనుకుంది. గొంతెత్తి ప్రపంచానికంతా వినబడేటట్టు "మానవతుల శీలాలకు ముప్పు తలపెట్టే కిరాతకుడు కూడా అచ్చంగా మానవుడిలాగే ఉంటాడు జాగ్రత్త! జాగ్రత్త" అని హెచ్చరిక చెప్పాలనుకుంది. కానీ ఆమె పెదవులు సైతం కదల్లేదు. చేతుల్లో చీటి తునాతునకలై పోయింది.

ఆ రాత్రి కల్యాణికి నిద్రపట్టలేదు. తను పుట్టింటిని వెతుక్కుంటూ వచ్చింది. అన్నయ్య ఆదరంతో, అనురాగంతో తనను సత్కరిస్తాడనుకుంది. వదిన తనతో మనసు విప్పి మాట్లాడుతుందనుకుంది. తన కలాంటి మన్ననలేవీ జరుగలేదు. పైగా ఈ యింట్లో కోడెత్రాచు తిరుగాడుతోందనే విషయం తన కిప్పుకిప్పుడే తెలియవస్తోంది. తనకిది ఉండదగిన చోటు కాదు. ఇక్కడికి రావడమే పెద్దపొరబాటు.

అర్ధరాత్రి దాటింది. బయట చలిగాలి రివ్వున వీస్తున్నా గదిలో మాత్రం వెచ్చగానే వుంది. చీకటీగలు మాత్రం రొదచేస్తూనే ఉన్నాయి. నిద్రిస్తున్న కుర్రాళ్లపైన ఏదైనా కప్పాలనుకుని కల్యాణి దుప్పటికోసం గదంతా వెదికింది. బాబు దాన్ని తీసుకెళ్ళి హాల్లో పారేశాడేమోనని తలుపు తెరిచింది. హాల్లో దీపం వెలగడం లేదు. గదిలో నుంచీ దీపకాంతి వచ్చి హాల్లో పడింది. ఆ వెలుగులో కల్యాణికి ద్వారం దగ్గర నిలబడి వున్న వాసు కనిపించాడు.

వాసు తలుపు తెరిచిన కల్యాణిని చూచాడు. అతడూ అప్పటివరకూ నిద్రపోక తనవల్ల వీలయినంత వరకూ కథను అల్లుకపోయాడు. తన చీటీని కల్యాణి చూచి ఉంటుంది. బదులులేదు. మౌనం అంగీకార సూచకమేమో! అదీగాక ఈమెకుకూడా నిద్రపట్టినట్టులేదు. పైగా తలుపు తెరుస్తోంది.

వాసు అడుగు ముందుకు వేయబోయాడు. కానీ కాలు కదలడానికి నిరాకరించింది. పెదవి విప్పబోయాడు. కానీ నోటికెవరో తాళం వేసేశారు! అతడు తన పాచిక పారిందనుకున్నాడు. అనుకుంటూనే ఏదో ఊహకందని భయంచేత ఆపాదమస్తకం గడగడ వణకిపోసాగాడు.

కల్యాణి కేం చేయడానికి పాలుపోలేదు. ముల్లువచ్చి అరిటాకుపైన పడినా, అరిటాకు ఎగిరి ముల్లు మీద పడినా చిరిగేది అరిటాకే నన్న సత్యం కల్యాణికి తెలియంది కాదు. ఆమె ఆలోచించింది. ఇది తనకు అనువుగాని చోటు. ఇక్కడివాళ్ళు తన సౌశీల్యాన్ని గుర్తించగలరని నమ్మడానికి వీల్లేదు. కానీ ఇప్పుడు తనేం చేయాలి?

కల్యాణి ఒక నిర్ణయానికి వచ్చేలోపల రెండు మూడు నిమిషాలు గడిచాయి. ఆమె తలుపుని ముందరికి త్రోసి సందులోనుంచీ వాసుని చూస్తూ "నేనాడదాన్ననీ, ఒంటరిగా వున్నాననీ నువ్వేదో దౌర్జన్యం చేయాలనుకుంటున్నావు. నీకు మంచిగా చెబుతున్నాను. వినాశకాలం సమీపించితే గానీ ఇలాంటి దుర్బుద్ధి పుట్టదు.బుద్ధి తెచ్చుకుని ఇక్కడినుంచీ వెళ్లిపో. రేపటినుంచీ నీ ముఖాన్ని నాకు చూపకు" అని ఒక్క విసురుతో తలుపుమూసి గడియ వేసుకుంది.

ఆ మరునాటి ఉదయం శేషమాంబ పడకపైన లేచి కూచుని, తన కెదురుగా కుర్చీలో కూచుని వున్న కల్యాణిని చూచి ఆశ్చర్యపడుతూ "ఏం కల్యాణీ! తెల్లవారకముందే యిలా వచ్చేశావు! ఇంకా కుర్రాళ్లు నిద్రలేవలేదేమిటి?" అంది.

"ఇంకా లేవలేదు వదినా! నాకేమో వాతావరణం బొత్తిగా సరిపడ్డంలేదు. ఊరికి వెళ్ళిపోదామనుకుంటున్నాను."

" మీ అన్నయ్య రానీ వుండు, వెళ్లువు గానీ,"

"లేదు వదినా! నాకేమో ఇక్కడ భయంగా వుంది."

"భయమా! ఇక్కడేం భూతాలున్నాయా కల్యాణీ!"

"భూతాలు యిష్టంవచ్చినట్టు ఏ రూపాన్నయినా ధరించగలవు కదా వదినా! ఈ నమ్మకం ప్రకారం ఆలోచించినట్టయితే యిక్కడ మానవ రూపాన్ని ధరించిన భూతాలున్నాయేమోనని నాకు సందేహంగా వుంది."

"ఏమమ్మా మరదలా! పరిహాసాలు ప్రారంభిస్తున్నావా?" అంటూ శేషమాంబ అద్దంలో ముఖం చూచుకుంటూ కేశపాశాన్ని సవరించుకోసాగింది.

"పరిహాసాలు కావు వదినా! ఈ సంగతి నీకు చెప్పకుండా వుండలేకపోతున్నాను. మీ తమ్ముడున్నాడు చూడు, వాసు! అతణ్ణి వాసు అనడం కన్నా వాసుకి అనడం

సమంజసంగా వుంటుంది. అతడు నిన్న నా దగ్గర తనిన్ని రోజులుగా లోలోపల దాచుకున్న హాలాహలాన్ని వెళ్ళగక్కేశాడు."

"ఏమిటీ!" తోకత్రొక్కిన త్రాచులా కల్యాణివైపు తిరిగింది శేషమాంబ.

"ఆ పాడు సంగతి వివరంగా ఎలా చెప్పను వదినా! నువ్వూ నాలాంటి ఆడదానివి! నిదానంగా ఆలోచించుకో, అన్నయ్య వచ్చినా రాకపోయినా నేను రేపో మాపో ఊరికి వెళ్ళిపోవాలి" అంటూ కళ్యాణి గదిలోనుంచి బయటికి పోబోయింది.

"ఐతే కల్యాణీ! యీ అభాండాన్ని మోపి వాడిని నలుగురిలో నగుబాట్ల పాలుచేయాలని నీ వుద్దేశమా!" అని శేషమాంబ కల్యాణిపైకి ఒక నిశితోక్తి విసిరింది.

"అబ్బే, నా వుద్దేశం అదికాదు వదినా? నీ తమ్ముడి విషయం నీతో రహస్యంగా చెప్పానంతే" అని కల్యాణి తరువాత అక్కడ నిలుచుకోకుండా మెట్లుదిగి క్రిందికి వచ్చేసింది.

ఆ రోజు మధ్యాహ్నం నాగరాజు ఊరినుంచీ తిరిగి వచ్చాడు. వస్తూనే స్నానంచేసి భోజనం కానిచ్చి మేడపైకి వెళ్ళిపోయాడు. కల్యాణి అతడు క్రిందికి దిగిరాగలడని సాయంత్రం వరకూ ఎదురు చూచింది. చివరికి తనే మేడపైకి వెళ్తేవచ్చే అగౌరవమేముందని రవిని తీసుకుని మేడమెట్లెక్కింది. ఆమె సరాసరి నాగరాజు గదిలోకి వెళ్ళాలనే అనుకుంది. కానీ లోపల ఏదో తీవ్రమైన చర్చ జరుగుతుండడం విని గది బయటే నిల్చుంది.

శేషమాంబ ప్రసంగంలో చిట్టచివరి మాటల్ని మాత్రం వినగలిగింది కల్యాణి.

"వీడు వట్టి బోళాబాయిరకం కదండీ! మీకు తెలియందేముంది? తెల్లనివన్నీ పాలనుకుంటాడు. శుద్ధ అమాయకంగా ఆమెతో ఏం మాట్లాడాడో ఏమో! పరిచయమున్న అమ్మాయి కదా, పైగా వరుస కూడా వుంది కదా అని తమాషాకి ఏమైనా అన్నాడేమో! ఆమె గోటబోయే పనికి గొడ్డలే పైకితీస్తోంది. వీడట, మానవరూపంలో వున్న దయ్యమట! అబ్బబ్బ, ఆ మాటల్ని వినలేకపోయానంటే నమ్మండి."

"ఇంతకూ నేనేమన్నానని బావా! చూడు కల్యాణీ, నీ గుణగుణాలకు, రూపలావణ్యాలకు తగిన భర్త నీకు దొరకలేదన్నాను. అంతే. ఇంతమాత్రానికే ఆవిడ...." వాసు వాక్యాన్ని సగంలో త్రుంచివేశాడు.

"పోనీలేరా వాసూ! మా చెల్లెలని నేనేమీ ఆమెను వెనకేసుకుని రావడంలేదుగా! విశాల దృక్పథం లేనివాళ్ళతో వచ్చిన చిక్కు యిదే!" నాగరాజు ఈ పలుకులతో ఆ చర్చని ముగించాడు.

కల్యాణి కళ్ళల్లో నీళ్లు గిఱ్ఱున తిరిగాయి. నిజంగా నాగరాజు ధోరణి ఆమె మనసుపైన పెద్ద వ్యాఘాతంలా పనిచేసింది. తనపట్ల వాసు ప్రవర్తన సైతం ఆమె కంతటి విచారం కలిగించలేదు.వదిన ముఖాముఖీ నిలిచి తనని దూషించినా ఆమె కంతటి అవమానం కలుగదు. వాళ్ళెవరో? తనెవరో? కాని ఒక రక్తం పంచుకుని పుట్టిన అన్నయ్య తనకి విశాల దృక్పథం లేదనీ, అక్కడికి తన భార్యా, బావమరిది ఏదో గొప్ప సంస్కారం గలిగినవారైనట్టు మాట్లాడుతుంటే, ఆమెకి తలని గోడకు మోదుకుని విలపించాలనిపించింది. కానీ ఆదినుంచీ ఆమెని వదలని మనస్సంయమనం అప్పుడు కూడా ఆమెకు బాసటై నిలిచింది. కన్నీళ్ళు తుడుచుకోకుండానే ఆమె మెట్లుదిగి తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఆ రోజు రాత్రి పడుకోకముందు అన్నా చెల్లెళ్ళిద్దరూ కలుసుకోవడం తటస్థించింది.

భోజనమైం తర్వాత తాంబూలం నములుతూ నాగరాజు చెల్లెలి గదివరకూ వచ్చి "ఏం కల్యాణీ! ఒంట్లో కులాసాగా వుంది కదూ! ఇది మలేరియా ప్రాంతం" అన్నాడు.

"జబ్బేమీ లేదన్నయ్యా! వచ్చి ఏడెనిమిది రోజులు కావస్తోంది. ఆయన అటు స్కూలుతోనూ, ఇటు వంటతోనూ సతమతమై పోతుంటారు. అదీగాక కుర్రాళ్ళు ఆయన్ని వదిలిపెట్టి వుండలేరు. ఊరికి వెళ్ళాలని వదినతో చెప్పాను. నువ్వు వచ్చేదాక ఆగమంది."

"రాక రాకవచ్చావు. అప్పుడే వెళ్ళిపోవాలంటే ఎలా కల్యాణీ?" అన్నాడు నాగరాజు.

"మళ్ళీ ఎప్పుడైనా రాకపోతానా అన్నయ్యా!"

"సరే నీ యిష్టం. నన్నొకసారి రమ్మని బావ రెండుమూడుసార్లు జాబు వ్రాశాడు. తీరికలేక రాలేకపోయానని చెప్పు కల్యాణీ! అన్నట్లు ఇప్పుడు మీరున్నది ముందున్న ఊళ్ళో కాదటగా! ఇంకేదో వూరికి ట్రాన్సుఫరు అయినట్టు జాబు వ్రాశాడులే ఒకసారి."

"ట్రాన్సుఫరు కాదన్నయ్యా! అక్కడ ఊస్టు చేశారు. ప్రక్కనే కృష్ణాపురంలో ఈయన స్వంతంగా ఓ స్కూలు ప్రారంభించారు. ఇన్ని రోజులూ ఓ అద్దెకొంపలో స్కూలు నడిపించారు. కట్టడం కట్టి చూపిస్తే గానీ రికగ్నిషన్ ఖాయం గాదట! అయిదువందల రూపాయలుంటే ఒక మాదిరి పూరికొంపైనా వేసుకోవచ్చు. ఆ కొత్తచోట అప్పుపుట్టదు. మీ అన్నయ్యని అడిగి చూడు అన్నారాయన. అప్పుగా యిచ్చినా సరే, రెండు మూడేండ్లలో తీర్చేయవచ్చు నన్నారు."

నాగరాజు యీ మాటవిని నవ్వయినా వుండవలసింది. లేక జాలైనా పడివుండవలసింది. కానీ అతడు నవ్వనూలేదు. జాలిపడ్డట్టు కనీసం అభినయించనుకూడా లేదు. ముక్తసరిగా "అంతగా అవసరమైతే ఒకజాబు వ్రాయమను కల్యాణీ! సర్దుబాటు చేసి పంపిస్తాను" అని హాల్లోనుంచే నాగుల్ని కేకవేసి "తెల్లవారుఝామున కల్యాణి ఊరికి వెళ్తుంది. ఆమెని స్టేషనులో వదలిపెట్టి రా" అంటూ మేడమెట్లవైపు వెళ్ళిపోయాడు.

## 5

మధ్యాహ్నం ఫస్టుబెల్ మ్రోగిన తర్వాత రాధాపతి అటెండెన్సు వేసి కుర్రాళ్ళ కేదో పాఠం చెప్పడానికి ఉపక్రమించబోతుండగా ఎవరో వచ్చి కల్యాణి వూరినుంచి తిరిగివచ్చిందన్న వార్త అతడి చెవిలో వేశారు. ఒక కుర్రాడిచేత తాళంచెవిని ఇంటికి పంపించి తెరచివున్న పాఠ్యపుస్తకాన్ని టేబిల్ పైన బోరగిలబెట్టి కుర్చీలో చేరగిలబడి రాధాపతి ఆలోచనలో మునిగి పోయాడు. కల్యాణి యింత త్వరగా తిరిగి రాగలదని తను అనుకోలేదు. ఒకవేళ ఆమె తనవారి ఆత్మాధిక్యతముందు కుంచించుకుపోయిందేమో! అందుచేత అక్కడుండడానికి సరిపడక పారిపోయివచ్చేసిందేమో! ఐతే ఇంతకీ పోయినపని ఏం చేసుకుని వచ్చిందోమరి!

పంతులుగారు ఏదో ముఖ్యమైన విషయాన్ని గురించి ఆలోచిస్తున్నారుగదా అని ఊరుకునే యింగితజ్ఞానం సర్వసాధారణంగా కుర్రాళ్ళలో కనపడదు. అవకాశం దొరకడమే తరువాయి వాళ్ళ అల్లరి శ్రుతిమించి రాగానబడడానికి ఎంతోసేపు పట్టదు. రాధాపతి త్రుళ్ళిపడిలేచి నిటారుగా కూచుంటూ 'సైలెన్స్, సైలెన్స్' అని పుస్తకాన్ని చేతికి తీసుకున్నాడు.

తరువాత గంట నాలుగున్నరైే లాస్ట్‌బెల్ మ్రోగేంతవరకూ రాధాపతి తాత్కాలికంగా కల్యాణిని గురించి, తన సంసారాన్ని గురించి, తనింక కట్టవలసిన కట్టడాన్ని గురించి మరచిపోయి కుర్రాళ్ళ లోకంలో కలసిపోయాడు.

బెల్ మ్రోగింది. కుర్రాళ్ళందరూ వెళ్ళిపోయారు. రాధాపతి రికార్డుల్ని డ్రాయరులో వుంచి చరచరా బయటికి వచ్చి తలుపులు మూసి బీగంవేశాడు. ఇంటిదగ్గర పాలుకూడా లేవు. కల్యాణి కాఫీ అయినా కాచి పిల్లలకిచ్చి వుండదేమో ననుకుంటూ గబగబ అడుగులు

వేస్తూ యింటివైపు నడవసాగేడు. అతడు పదిబారల దూరం వెళ్ళివుంటాడంతే. ఒక కుర్రాడు వెనుక నుంచే వచ్చి "సార్? ఎవరో స్కూలెక్కడ అని అడుగుతూ జట్కాలో వస్తున్నారు" అన్నాడు.

రాధాపతి కంగారుపడ్డాడు. ఆరోజు తన గడియారం నాలుగున్నరయే సరికే అతడు స్కూలు మూసేశాడు. న్యాయంగా ఆలోచిస్తే ఇంకొక పది నిముషాలు స్కూలు వుంచుకోవలసింది. ఎవరెవరి గడియారాలు ఎట్లా నడుస్తాయో చెప్పలేంకదా మరి! ఆ ఆగంతకుడు తప్పకుండా ఇన్‌స్పెక్టరే అయి ఉంటాడనుకుని రాధాపతి గబగబ వెళ్ళి స్కూలు తలుపులు తెరిచాడు.

కానీ తీరా జట్కా స్కూలు ముందరికివచ్చి ఆగిన తర్వాత అందులో నుంచీ దిగినవ్యక్తిని చూచి రాధాపతి తెల్లబోయాడు. ఆగంతకుడు ఇన్‌స్పెక్టరు కాదు. నాగరాజు!

"అదేమిటి నాగరాజూ! మీ చెల్లెలు మధ్యాహ్నమనగా వచ్చింది. నువ్విప్పుడొస్తున్నావు. ఇద్దరూ కలిసి రాకూడదూ?" అంటూ రాధాపతి జట్కాలో బెడ్డింగు వగైరా లున్నాయేమోనని దగ్గరికి వెళ్ళాడు. జట్కా శూన్యంగా ఉంది. అంతలో నాగరాజు జట్కావాడికి కూలీడబ్బు ముట్టజెప్పి స్కూల్లోకి వెళ్ళిపోయాడు.

రాధాపతి నాగరాజు వెనుకనుంచే లోపలికి వెళ్తూ "ఏమిటది నాగరాజూ! వచ్చినవాడివి ఇక్కడ కూచుంటున్నావు! నీ రాక కల్యాణికి తెలుసుకదా! ఆవిడ వచ్చిన తర్వాత నేను గూడా ఇంకా ఇంటికి వెళ్ళనేలేదు" అన్నాడు.

"వెళ్దువుగానీ కూచో బావా! కొంచెం మాట్లాడాలి" అన్నాడు నాగరాజు.

"ఆ మాట్లాడేదో ఇంటికి వెళ్లిన తర్వాత తీరిగ్గా మాట్లాడుకోగూడదా నాగరాజూ!" అన్నాడు రాధాపతి.

"కాదు బావా! ఇక్కడే మాట్లాడ్డం మంచిది. నేను చెప్పబోయే విషయం నీ మనసుకు బాధాకరమైందే కావచ్చు. కానీ చెప్పక తప్పదు. రాత్రి నా యింట్లో చోరీ. ఇనప్పెట్టె తాళాలు ఎక్కడుండాలో అక్కడే ఉన్నాయి. పెట్టె మూసింది మూసినట్టే ఉంది. లోపలున్న నగలు, వెండి సామానులు కూడా అలాగేవున్నాయి. మళ్లీ అందులో అదృష్టమేమిటంటే డబ్బు పూరాగా కూడా దోచుకోబడలేదు. అందులో ఇప్పుడులేంది ఐదువేల రూపాయలు మాత్రమే! ఐదువేలంటే అంత తక్కువ మొత్తం కాదు. ఇంట్లో నౌకర్లయినా పడుకోరు. వాళ్ళకోసం ఇంటి బయట వేరే గుడిసెలున్నాయి. మరి బయటివాళ్ళెవరో వచ్చి ఈపని చేసివుంటారనుకోవడానికి ఆధారమే కనిపించడంలేదు. ఇది అలాటి వాళ్ళ పనైవుంటే పెట్టె సీదాగా ఖాళీ అయిపోయి వుండేది."

నాగరాజు మాటలకు అడ్డొచ్చి రాధాపతి "ఐతే, నీ అనుమానం ఎవరిపైన నాగరాజూ?" అన్నాడు. అనడమేమిటి, ఆక్రోశించాడు.

"అదే చెప్పబోతున్నాను బావా! ఇది ఇంట్లో వాళ్ళుతప్పా మరెవరూ చేసినపని కాదని తెలుస్తోంది కదా! ఇంట్లో మాత్రం బోలెడుమంది ఎవరున్నారు గనుక? నేనూ, మా ఆవిడ, కల్యాణీ తప్పా ఇంకెవరూ లేరు. ఆ వాసు ఒకడున్నాడనుకో. వాడంత అన్నంగతికి వరండా ప్రక్కన గదిలో పడుకుంటాడు. తెల్లవారేదాకా చస్తే లేవడు. అదీగాక వాడీ డబ్బు కాజేసివుంటే ఈపాటికి ఏ మదరాసుకో, బొంబాయికో పరారై పోయివుండేవాడు. అలా అనుమానించడానికి వీలే లేదాయె! ఇంకా యేం చెప్పను బావా! ఇప్పటికే నీకు అర్థమై ఉంటుంది."

రాధాపతి దిగ్భ్రాంతితో నాగరాజు మాట్లాడుతున్నంత సేపూ అతడి ముఖాన్ని చూస్తూ వుండిపోయాడు. అతడి కళ్ళ ఎదుట ప్రపంచం గిర్రున తిరుగసాగింది. అతడు లేచాడు. ఒకటి రెండుసార్లు ఆ గదికీ ఈ గదికీ మధ్య వడివడిగా పచార్లు చేశాడు. "నువ్వు అనాలోచితంగా మాట్లాడుతున్నావు నాగరాజూ! కల్యాణి నీ తోబుట్టువు. ఆమె గుణం నీకు తెలియందికాదు. ఐనా నీ మతి యిప్పుడు పెడదారి పట్టింది. నువ్విప్పుడు నింపాదిగా మంచేదో చెడ్డదో ఆలోచించే స్థితిలో లేవు" అందామనుకున్నాడు. కానీ అనలేకపోయాడు. ఇంట్లో వున్నవాళ్ళు ముగ్గురే. తమ సొత్తును తామే దొంగిలించవలసిన అవసరం ఆలుమగళ్ళ కుండదు కదా! మరి డబ్బేమై వుంటుంది. ముంజేతి కంకణాని కద్దమెందుకు? ఇక్కడ అనుమానించడానికి ఎవరికైనా అవకాశముంది. "కడకు ఎంతపని చేశావు కల్యాణీ! పాపిష్టి డబ్బుపట్ల నీలోకూడా యింత ప్రలోభం దాగివుంటుందని, నేను కలైనా కనలేదే కల్యాణి!" అనుకున్నాడు. అనుకుంటూ ఆగ్రహపరవశుడై వీధిలోకి వచ్చాడు. పంతులుగారు గాలిపాటుకు ఎగిరిపోతున్న ఎండుటాకులా వీధిలో పరుగెడుతుండడం చూచినవాళ్ళందరూ విస్తుపోయారు. కులగిరులు పైనబడ్డా కంపించని మనిషి. ఈయన ఈ రోజు ఇలా మీరిపోయా దేమబ్బా అని ఒకరినొకరు ప్రశ్నించుకున్నారు. వాళ్లకు జవాబు దొరకలేదు.

సుడిగాలిలా ఇంట్లోకి వచ్చి పడ్డాడు రాధాపతి. ప్రక్కగదిలో ట్రంకు పెట్టెతో ఎవరో కుస్తీ పడుతుండడం విని కల్యాణి వంటగదిలో నుంచీ బయటికి వచ్చింది. రాధాపతి చురకత్తితో తాళాన్ని బద్దలు కొట్టేస్తున్నాడు. "అదేం పనండీ? ఏం చేస్తున్నారు మీరు? నన్నడిగే తాళంచెవి యివ్వనటండీ!" అంటూ కల్యాణి రాధాపతిని బిత్తరపోయి చూచింది. ఆపాటికే తాళం బద్దలైపోయింది. పెట్టెమూత తనంతట తానే తెరచుకుంది. రాధాపతి పెట్టె కుమ్మరించాడు. చీరలను చెల్లాచెదరు చేశాడు. చెదరుగా పడివున్న చీరల్ని మడత విప్పి చూశాడు. పెట్టె అట్టడుగున వున్న పాత న్యూసుపేపర్ని కూడా చింపి అవతల పారేశాడు. సర్వశూన్యంగా మిగిలిన పెట్టెని ఒక మూలకు గిరవాటు వేసి "ఏదీ డబ్బు! ఎక్కడ దాచావో చెప్పు" అని గద్దించాడు.

"డబ్బెక్కడుందండీ! అన్నయ్య నడిగాను. అంతగా అవసరమైతే జాబు వ్రాయమని చెప్పు. సర్దుబాటు చేసి పంపిస్తానన్నారు. మీరామాట అడక్కుండానే హంగామా చేస్తున్నారు."

"నేనా డబ్బుని గురించి కాదు అడుగుతోంది! నువ్వు దొంగిలించి తెచ్చిన అయిదు వేలెక్కడని అడుగుతున్నాను" రాధాపతి కళ్ళు ఎర్రబడ్డాయి. అతడి ముఖం అభిమానం దెబ్బతిన్నవాడి ముఖంలా అదిరిపోసాగింది.

"ఏమిటండీ మీ మాటలు! నేను డబ్బు దొంగిలించానా! ఎవరన్నారు మీతో?" కల్యాణి తలపైన పిడుగు పడ్డట్టయింది.

"ఎవరోగాదు అంటున్నది, నీ తోబుట్టినవాడే. కుండబద్దలు కొట్టినట్టు చెబుతున్నాడు. వెళ్ళు. అతడికేం చెప్పుకుంటావో చెప్పుకో" అంటూ రాధాపతి కల్యాణి మెడబెట్టి గడపదాకా గెంటుకొచ్చాడు.

"అయ్యయ్యో! ఎక్కడికి వెళ్ళమంటూ రండీ నన్ను! ఐనా ఇదేం అపవాదండీ? నాపైన తోశారు!" కల్యాణి వెక్కి వెక్కి ఏడుస్తూ ఇరుగు పొరుగు వాళ్ళు చూచిపోతారేమోనని తలుపు మూసుకోబోయింది.

"మాన మర్యాదలు నట్టేట్లో కలిసే పనిచేసి, మళ్ళీ తలుపు మూసుకుంటా వెందుకు? వెళ్ళు. ఆ స్కూల్లో వున్నాడు మీ అన్నయ్య. చూడు కల్యాణీ! కోపం వచ్చిందంటే నేను

పశువుని. ఆ డబ్బు తీసుకెళ్ళి అతడి ముఖాన కొట్టి మరీ ఇంకొక పనిచూడు. నన్ను యింకా కొద్దిరోజులపాటు ఈ లోకంలో తలెత్తుక తిరగనీయ్!" రాధాపతి పెరటి తలుపు తెరచుకుని పొలాల్లోపడి ఊరికి దూరంగా వెళ్ళిపోయాడు.

ఏడుస్తున్న కల్యాణిపైన బడి బిడ్డలు కూడా ఏడవసాగేరు. ఊళ్ళో అన్ని యిళ్ళలోనూ దీపాలు వెలిగాయి. రాధాపతి యింట్లో మాత్రం ఆ రోజురాత్రి దీపం వెలగలేదు. ఊరంతా మాటుమణిగింది. బిడ్డలు ఏడ్చి ఏడ్చీ నిద్రపోయారు. కల్యాణి తలుపు తెరుచుకుని వీధిలోకి వచ్చి మెల్లగా స్కూలువైపు నడువసాగింది.

స్కూల్లో దీపం వెలుగుతోంది. ఊళ్ళో పెద్దమనుషుల్లో చాలామంది అక్కడ ప్రోగయ్యారు. కల్యాణి చీకట్లో ద్వారానికి ఈవల నిలబడింది.

ఒక ముసలాయన అంటున్నాడు : "మీరెంత చెప్పినా ఆ అమ్మాయి యింతటి పని చేసిందంటే నమ్మలేకపోతున్నానండీ! ఐనా కాలం మారింది. ఇప్పుడు సత్యహరిశ్చంద్రుడు బ్రతికివున్నా రోజుకొకటి రెండబద్ధాలు చెప్పకుండా వుండలేకపోయేవాడేమో!"

"పోయింది పదులూ, నూర్లూ అయితే అయ్యగారు యింతదూరం వచ్చేవారేనా నరసయ్యా! ఒకటికాదు, రెండుకాదు, ఐదువేలు! ఒక్కసారిగా ఐదువేలు పోయి, అదీ ఎలా పోయిందో తెలిసికూడా. యింకా ఈయన యింత నెమ్మదిగా వున్నారంటే, చూచుకో, నిండుకుండ తొణకదన్న దెందుకో! చూడండి బాబయ్యగారూ! మీ సొమ్ము గట్టిదైతే తెల్లవారే సరికి మిమ్మల్ని వెదుక్కుంటూ వస్తుంది. మీరు నిశ్చింతగా పడుకుని నిద్రపోండి" ఇంకొకాయన సాగదీశాడు.

కల్యాణి గిర్రున వెనుదిరిగి ఇంటికి దారితీసింది. బిడ్డల్ని ప్రక్కలో పడుకోబెట్టుకుని పెరట్లో పడుకున్న భర్తని చేరింది. వంటయింట్లో తను పొయ్యి మీదనే విడిచిపెట్టిన అన్నం చిమిడి పోయింది. తను కాపురానికి వచ్చిన ఏడెనిమిదేళ్ళలో భర్త పస్తుపడుకున్న రోజొక్కటీలేదు. ఈ రోజు ఉత్తపుణ్యానికి నిర్నిమిత్తంగా ఈ అభాండం వచ్చి తన తలపైన వ్రాలింది. వ్రాలితే నేం! ఎలాటి వారికైనా ఇలాటి శోధనలు సంభవిస్తుంటాయ్. ఏనాటికైనా తన నిర్దోషిత్వం ఋజువవుతుంది.

కల్యాణి పడుకోలేదు. ప్రక్కయింటిలో గోడగడియారం పన్నెండు సార్లు మ్రోగేవరకూ ఆమె చీకట్లో తలవంచుకుని కూర్చుంది. అప్పుడు లేచి తలుపులు తీసి మళ్ళీ స్కూలువైపు నడిచింది. నిజానిజాలు తేల్చివేసిన పెద్దమనుషులందరూ వెళ్ళిపోయారు. నాగరాజొక్కడు మాత్రం రెండు బెంచీలు దగ్గరగా వేసుకుని పడుకున్నాడు. కల్యాణి లోపలికి వెళ్ళింది. నాగరాజు పాదాలచెంత బెంచీపైన కూర్చుంటూ "అన్నయ్యా, అన్నయ్యా" అని పిలిచింది. నాగరాజు ఉలికిపడి లేచాడు. లేస్తూనే చెల్లెల్ని చూచాడు. చూచి ముఖం మరోవైపుకు త్రిప్పుకున్నాడు.

కల్యాణి లేచి నిల్చుంటూ "ముఖం త్రిప్పుకోకన్నయ్యా! నన్నొకసారి చూడ్డానికైనా నీకు మనస్కరించడం లేదు కదూ! అవును. నేనీనాడు భర్తచేత నీచురాల్నిగా భావింపబడినదాన్ని. ఈనాడు నేను లోకంచేత మోసగత్తెగా, దొంగగా ఎంచబడిన దాన్ని. లోకులు కాకులు. నేను వాళ్ళసంగతి చెప్పడం లేదు. నువ్వు నాకు అన్నయ్యవి. నాన్నగారు చనిపోయి పదేళ్ళయింది. అమ్మ నాకు తెలియకముందే చనిపోయింది. నాకు తల్లయినా తండ్రయినా నువ్వేనని నే ననుకున్న రోజులున్నాయి. అప్పటికీ ఇప్పటికీ నీలో చాలా మార్పు వచ్చింది. నీకూ నాకూ మధ్య ఇనుపగోడలు లేచాయి. లేకలేక నేను

నీయింటికి వచ్చాను. మా వదిన నాకోసం ఒక గది ప్రత్యేకించింది. అమ్మ వుంటే నేనామె ఒడిలో పడుకునేదాన్ని! నే నా గదిలోనే నా బిడ్డలతో బాటు పది పదిహేను రోజులు కాలం గడిపాను. ఒకనాడైనా నువ్వు ఇలా రారా బాబూ అంటూ ఒక కుర్రాడినైనా చేరదీయలేదు. నువ్వా కుర్రాళ్ళకి మేనమామవి - వాళ్ళపైన నీకంత అంతఃకరణ ఉంది. అదలా వుండనీ! నీ బావమరిది నీకు అమాయకుడిలా కనిపించాడు. నేను మాయలాడినని నువ్వు నోరువిడిచి చెప్పలేదు. అది నా అదృష్టం! వాడు మొదట నీకుతగిన మొగుడు దొరకలేదంటూ ఉపక్రమించాడు. ఆ సాయంత్రం ప్రేమలేఖ వ్రాశాడు. ఆ రాత్రి దౌర్జన్యం చేయాలని చూచాడు. వాడు నీ పాటిలికి గొప్ప సంస్కారం కలిగిన వాడిలా కనిపించాడు. నేను విశాల దృక్పథం లేనిదాన్నయ్యాను. ఇన్నిమాట లెందుకన్నయ్యా! నేను నీ యింటికి రావడమే తప్పు. పొరబాటు జరిగింది. ఐనా ఈ మాటలన్నీ నీకనవసరం. నీ డబ్బు పోయింది. ఇప్పుడు నీ చింత అది! నేను కావలిస్తే నా బిడ్డలపైన ప్రమాణం చేసి చెబుతాను. నీ డబ్బేమైందో నాకు తెలియదు. ఈరోజు నువ్వు ఈ వూరి కొచ్చావు. తిండిలేకుండా పడుకున్నావు. నువ్వొక్కడివే కాదు. ఆయన నిండుపస్తుతో పెరట్లో పై గడ్డయినా పరుచుకోకుండా పడుకున్నారు. ఈరోజు నన్నాయన మెడబట్టి బయటికి గెంటబోయారు. ఎలాగూ నాకు పుట్టినిల్లు కరువైపోయింది. మెట్టినింటికి కూడా ఎసరు పెట్టదలచుకోకు. నీకు చేతులెత్తి నమస్కరిస్తున్నాను. నువ్వు తెల్లవారక ముందే యిక్కడినుంచీ వెళ్ళిపో."

నాగరాజు తల దిమ్మ తిరిగింది. అతడు "లేదు కల్యాణీ నువ్వలా చేసివుండవని నాలో నాకు ఎవరో చెబుతున్నా వినిపించుకోక పోయాను. నేను పాపిష్టివాణ్ణి" అనాలనుకున్నాడు. కానీ ఆలోపలే కల్యాణి అక్కడినుంచీ వెళ్లిపోయింది.

## 6

నాగరాజు స్వగ్రామానికి తిరిగి వెళ్లి గ్రామ మునసబు ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పదిరోజుల తర్వాత పోలీసులు గిండీ గుఱ్ఱప్పందాల్లో ఒక వ్యక్తిని అనుమానించి అరెస్టు చేశారు. పోయిందిపోనూ అతడివద్ద మిగిలివున్న రెండువేల రూపాయలు స్వాధీనం చేసుకొని నాగరాజుకు కబురు పంపారు. నాగరాజు మదరాసు వెళ్లాడు. కటకటాల్లో వున్న ఖైదీని చూచాడు. "ఇతణ్ణి మీరెరుగుదురాండీ?" అని సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించాడు. నాగరాజు తల ఉపాడు."ఇది చాలా అసాధ్యమైన ఘటంలా కనివిన్పోందండీ! ఇతడు దొంగతనమే నాకు తెలియదు పొమ్మంటున్నాడు. ఇంటి యజమానురాలే స్వయంగా ఇతడికి డబ్బిచ్చి వాడుకోమందట!" అన్నాడు సబ్‌ఇన్‌స్పెక్టర్. నాగరాజు అతడి చేతులు పట్టుకుని "దయచేసి వీడిని వదిలేయండి ఇన్‌స్పెక్టరు గారూ! లేకుంటే ఆడది బోనులో నిలబడవలసివస్తుంది" అన్నాడు. ఇన్‌స్పెక్టర్ "అబ్బే, వీల్లేదండీ! ఫైలు పైవాళ్ళ దాకా వెళ్ళిపోయింది. ఇక కేసు జరగాల్సిందే" అన్నాడు.

నాగరాజు ఖైదీతో పది నిమిషాలపాటు మాట్లాడడానికి పర్మిషను తీసుకుని కటకటాల దగ్గరికి వెళ్లాడు. "ఒరే వాసూ!" అని పిలిచాడు. వాసు గోడవైపు తిరిగి నిల్చున్నాడు. నాగరాజు గోడని వుద్దేశించి చెప్పుకుపోయాడు. "రంగధామయ్య గారు బిడ్డలు లేక నన్ను దత్తత చేసుకున్నారు. నాకూ బిడ్డలు లేరు! ఈ ఆస్తి ఎప్పటికైనా అన్యాక్రాంతమై పోయేదే. నువ్వు అయిదువేలు కాజేసినందుకు చింతలేదు. కానీ ఈ దురాగతాన్ని నువ్వొక నిర్దోషిపైన తోయజూచావు. పైగా ఈ దొంగతనం చేయడంలో నీ ప్రయోజకత్వ మేమీ లేదనీ, ఇంటావిడే నీకీ పైకాన్ని కాజేయడంలో తోడ్పడిందని అంటున్నావనీ విన్నాను. కావచ్చు!

ఏ పుట్టలో ఏ పాముంటుందో ఎవరికెరుక! ఇక కేసు జరుగుతుంది. జరగాల్సిందే! అక్కా తమ్ముళ్ళు ఒకరిపైన మరొకరు నేరారోపణ చేసుకుని, నా మాన మర్యాదల్ని నట్టేట్లో కలుపబోతున్నారు. నలుగురూ నన్ను చూచి నవ్వుతారు. నవ్వాలిసిందే! నేను చేసిన అపరాధానికి అదే నాకు శిక్ష!"

వెనుకనుంచీ పోలీసు "పది నిమిషాలయిపోయిందండీ! అన్నాడు. 'నా మాటలు కూడా అయిపోయాయి' అనుకుంటూ నాగరాజు స్టేషను నుంచి బయటికివచ్చి, అక్కడినుంచీ సరాసరి పోస్టాఫీసుకు వెళ్లి కార్డు తీసి "చిరంజీవి చెల్లెలు కల్యాణికి దీవించి వ్రాయునది: నిష్కారణంగా నిన్ను అనుమానించాను. నిజమైన దొంగ పట్టుబడ్డాడు. నన్ను మన్నించగలిగితే మన్నించు" అని వ్రాసి సంతకం చేసి పోస్టు చేశాడు. రెండు మూడు వారాల వరకూ ప్రత్యుత్తరం కోసం నిరీక్షించాడు. తరువాత మళ్ళీ ఇంకొక జాబు వ్రాస్తూ దానితోబాటే బడికట్టడం కోసం అయిదువందల రూపాయలు ఇన్‌ష్యూర్ చేసి పంపించాడు. పంపిన నాలుగో రోజున అది తిరిగి నాగరాజు చేతికే వచ్చింది. దానితో బాటూ మరో కార్డు కూడా అందింది. కార్డులో ముచ్చటగా మూడు పంక్తులు మాత్రమే వున్నాయి. "అన్నయ్యా! నా నిర్దోషిత్వం బయటపడ్డం మాత్రమే నాకు కావలసింది. లేదంటే అన్న చెల్లెలి పట్ల చూపించవలసిన ఆదరంలో శతాంశమో, సహస్రాంశమో నీనుంచీ కోరుతున్నానంతే! డబ్బు నాకు అవసరం లేదు. మరచిపోకు. ఇట్లు, నీ చెల్లెలు. కల్యాణి."